క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిస్ట్రిక్ 102 ఎలక్ట్ గవర్నర్ ఎ.తిరుపతిరావు అన్నారు. శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న జగదాంబ నగర్, గురజాడ అప్పారావు కాలనీలో మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ నేటి మానవుల జీవన విధానానికి మొక్కలే ప్రాణాధారమని, మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు ఎ.ఎస్.ప్రకాశరావు మాస్టారు, క్లబ్ ప్రతినిధులు వల్లూరి శ్రీనివాసరావు, కోట్ల సత్యనారాయణ, జి.గోవిందరావు, ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, పెనుమత్స అప్పలరాజు, వై.నల్లమరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పురస్కార గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీత సూర్యనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

భోగాపురం: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నచ్చిరెడ్డి సూర్యనారాయణకు బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయన పని చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎ.సూర్యనారాయణ, జిల్లా హెచ్ఎం అసోసియేషన్ డీసీ బోర్డ్ సెక్రటరీ సన్యాసిరాజు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా రంగంపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఆయన శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన కృషిని, శ్రమను ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేయడం అభినందనీయమన్నారు. హెచ్ఎంలు అప్పన్న, నగేష్, పీడీ సిహెచ్.సత్యనారాయణ, గ్రామ పెద్దలు వాసుదేవవర్మ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడిపై రెవెన్యూ ఉద్యోగి దాడి



గాయపడ్డ ఫిర్యాది దారుడు

విజయనగరం క్రైమ్ : నగరంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కేఎల్ పురంలో ఓ రెవెన్యూ ఉద్యోగి, ఓ యువకుడిపై దాడి చేశాడు. యువకుడు బైక్ నడిపి బురద నీరు తుళ్లించాడన్న కోపంతో గంట్యాడ తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సతీష్ అనే ఉద్యోగి తనను తీవ్రంగా గాయపరిచినట్టు యువకుడు పిల్ల నానిబాబు విజయనగరం పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని విచారిస్తున్నారు.

బోటిక్యూ షాప్ ప్రారంభోత్సవం



షాపును ప్రారంభిస్తున్న సిరిసహస్ర

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన తాలాడ సంతోషి స్థానిక సత్య థియేటర్ దగ్గర ఏర్పాటు చేసిన బోటిక్యూ షాప్‌ను చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం ఇటువంటి బోటిక్యూను ఏర్పాటు చేసుకోవడం మంచిదే అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దిల వాసు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేగాన శ్రీను, కౌన్సిలర్లు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, కో ఆప్షన్ సభ్యురాలు మాత సంధ్య, తాలాడ మహేష్, కనకల హైమావతి, మన్యపురి మోహన్‌రావు, బుగత శ్రీను, అవనాపు విజయభాస్కర్, సముద్రపు సత్తిబాబు, మద్దిల దుర్గారావు, నల్లి శివప్రసాద్, కొంకి సంతోష్, సముద్రపు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

- తీర ప్రాంతంలో ఐదు వేల ఎకరాల సాగు
- శాశ్వత అంతర పంటగా కోకో
- అన్నదాతకు ఆర్థిక భరోసా



కొబ్బరిలో సాగవుతున్న అంతర పంటలు

పూసపాటిరేగ : ఉద్యానవన తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాలలో అత్యధికంగా కొబ్బరి సాగు జరుగుతోంది. వాటిలో అంతర పంటలుగా కోకో, అరటి, జామి మొదలగు పంటలు వేసిన రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. కొబ్బరితో అంతర పంటలుగా వేయడం వలన ఎకరా సాగుకు సుమారు రూ.50 వేల వరకు లాభాలు ఆర్జిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. తీర ప్రాంతంలో సుమారు 10 వేల ఎకరాలలో కొబ్బరి సాగు కాగా వాటిలో సుమారు 5 వేల ఎకరాలలో అంతర పంటలు సాగవుతున్నాయి. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, కొణతాలపాలెం, కృష్ణాపురం, చౌడువాడ, రోలుచప్పిడి, చినపతివాడ, పెదపతివాడ, రాయుడుపేట, రెల్లివలస, కోనయ్యపాలెం, ముక్కాం, చేపలు కంచేరు, దిబ్బలపాలెం, గూడపువలస మొక్కాం, దిబ్బలవలస, ముంజేరు మొదలగు ప్రాంతాలులో అంతర పంటలు సాగు అవుతున్నాయి.

శాశ్వత అంతర పంటగా కోకో

కొబ్బరి అంతర పంటలో కోకో సాగును మించినది లేదని ఉద్యానవన అధికారులు తెలియజేస్తున్నారు. కోకో మొక్కను ఒకసారి నాటినట్లయితే 35 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుంది. కోకో సాగు నాటిన మూడో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభం అవుతోంది. కోకో సాగుకు చీడపీడలను తట్టుకొనే గుణం వుంటుంది. ఎకరా సాగులో 250 నుంచి 300 కేజీల వరకు ఆకు రాల్చడంతో ఆకు కుళ్లి నేలలో భూసారాన్ని అభివృద్ధి చేస్తుంది. దీంతో ప్రధాన పంట అయిన కొబ్బరితో పాటు కోకో సాగులో అత్యధిక లాభాలు వస్తాయి. ఎకరా కోకో సాగులో 300 నుంచి 400 కేజీల వరకు దిగుబడి వస్తుంది.

కోకోకు విదేశాల్లో గిరాకీ

కోకో పంటకు విదేశాలలో మంచి గిరాకీ ఉంది. కోకో పంటను మోండిలీజ్ అనే సంస్థ నేరుగా రైతు వద్దకు వెళ్లి కొనుగోలు చేసి రైతు ఖాతాకు నగదు జమచేయడం జరుగుతుందని ఉద్యానవన శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

తెగుళ్లకు చెక్

ఉద్యానవన సాగులో అంతర పంటల వేయడం వలన భూములకు ఎంతో మేలు జరుగుతోంది. అంతర పంటల సాగుకు భూములు బాగా కలియదున్నడం వలన తెగుళ్లు నివారించబడతాయి. అదే విదంగా భూసారం పెరిగి దిగుబడి పెరుగుతోంది.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవన రైతులకు అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. హెక్టారు సాగుకు 30 వేల వరకు రాయితీ, గరిష్ఠంగా ఒక రైతుకు రెండు హెక్టార్ల వరకు పథకం వర్తింపు అవుతోంది. తీర ప్రాంతంలో నీటి అనుకూలత వున్న చోట కోకో సాగును ప్రోత్సహించినట్లయితే సాగులో మరింత లాభాలు పొందవచ్చు.

– ఉమాభరణి, ఉద్యానవన శాఖ అధికారి, భోగాపురం.

వేడుకగా ఫ్రెషర్స్ డే

పూసపాటిరేగ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం కన్నులు పండగగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయనగరం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తును అందుకోవాలన్నారు. మంచి ఉత్తీర్ణత సాధిస్తే కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులంతా ఉన్నతమైన విలువల్ని అలవర్చుకోవాలని సందేశం ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్.హనుమంతరావు మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం సుమారు 60 ప్రవేశాలు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలుగు అధ్యాపకులు శ్రీను మెమెంటోతో పాటు నగదు పారితోషికాలు అందించారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఏపీసీ

పూసపాటిరేగ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఎ.రామారావు అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యా శాఖ అధికారులుతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదుల కొరత తదితర విషయాలపై నివేదిక ఇవ్వాలని మండలాల్లో విద్యాశాఖ అధికారులకు సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి పరిస్థితిపైన నివేదిక ఇవ్వాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి విద్యను అందిస్తే మరంత ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. విద్యా శాఖలో పని చేస్తున్న అందరి భాగస్వామ్యంతో మరింత ముందుకు తీసుకువెళ్తాం అన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.రాజ్‌కుమార్, బి.పాపినాయుడు, సిహెచ్.రమణమూర్తి, బి.చంద్రమౌళి, ఎస్ఎస్ఏ జేఈ వెంకటరమణ పాల్గొన్నారు.

జాతర నాటికి అన్ని కాలువలు శుభ్రం చేయాలి

విజయనగరం: పైడితల్లమ్మ జాతర నాటికి నగరంలోని అన్ని ప్రధాన, చిన్న కాలువలు సైతం పరిశుభ్రంగా ఉండాలని కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కె.సాంబమూర్తి ఆదేశించారు. బుధవారం నగరంలో పారిశుధ్య బృందాలతో కాలువల్లో పూడికలు తొలగింపు పనులను పర్యవేక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. పెద్దపెద్ద కాలువల్లో జేసీబీల సహాయంతో పూడికతీతలను చేపట్టాలని, ఇరుకైన వీధుల్లో బాబ్ కార్టుల సహాయంతో చెత్తలను తొలగించాలని సూచించారు. ఇరుకైన వీధుల్లో ప్రత్యేక పారిశుధ్య బృందాలతో చెత్తా చెదారాలను తొలగించాలని చెప్పారు. ఈ నెల 20వ తేదీ నాటికి నగరపాలక సంస్థకు సంబంధించి అవసరమైన అన్ని పనులను పూర్తి చేసేందుకు సిబ్బందికి నిర్దేశించామన్నారు. ఇందులో భాగంగా నగరమంతా సంపూర్ణ పారిశుధ్యం వెల్లివిరిసే విధంగా జాగ్రత్త వహించాలని ఆదేశించామన్నారు. పైడితల్లమ్మ జాతర రెండు రోజులు 900 మంది ప్రత్యేక పారిశుధ్య కార్మికులను వినియోగించనున్నట్టు చెప్పా రు. అయితే ప్రజలు కూడా సహకరించి వీధులను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తలను వేయరాదని సూచించారు.

మతోన్మాదానికి ఎదురు నిలిచిన యోధుడు ఏచూరి

విజయనగరం గంటస్తంభం: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మతోన్మాద ఏజెండాకు ఎదురునిలిచిన యోధుడు, కమ్యూనిస్టు పార్టీల ఐక్యానికి మహత్తర కృషి చేసిన మేధావి సీతారాం ఏచూరి అని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. విజయనగరం గురజాడ నగర్‌లో ఏచూరి చిత్ర పటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశంలో సోషలిజం సాధన కోసం జీవించినంత కాలం నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఉన్న మహానేత ఏచూరి అన్నారు. పార్లమెంట్‌లోను.. బయట ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడని కొనియాడారు. మతోన్మాదం ప్రమాదంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేసిన నేత ఏచూరి అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, శ్రామిక రాజ్యం సాధన కోసం పోరాటం చేయడమే ఆయనకిచ్చిన నిజమైన నివాళులు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, సీపీఎం నగర కమిటీ సభ్యులు రంభ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు చెక్ అందచేస్తున్న యూనియన్ నాయకుడు అప్పలరాజు

పూసపాటిరేగ : మైలాన్ పరిశ్రమలో పని చేసి వివిధ కారణాల రీత్యా అనారోగ్యంతో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు బీఎంఎస్ కార్మిక సంఘం నాయికుడు నల్ల అప్పలరాజు బుధవారం సాయం అందించారు. గైతులచోడవరానికి చెందిన నల్ల రాము కుటుంబానికి రూ.2 లక్షలు, వెంపడాం కొరటాన రామునాయుడు కుటుంబానికి రూ.2.43 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దోనితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పంట నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు



వరి సాగులో మెలకువలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

డెంకాడ: ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులు పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని డెంకాడ గ్రామంలో పొలం పిలుస్తోంది, యూరియా మీ చెంతకు కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యూరియా రాబోయే రెండు, మూడు రోజుల్లో కొన్ని రైతు సేవా కేంద్రాలకు వస్తుందన్నారు. ఖరీఫ్ వరి పంటకు రెండు దఫాలుగా యూరియా వేయకుండా, నానో యూరియా 500 మిల్లీలీటర్లు మందును 200 లీటర్ల నీటితో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా రైతులకు మేలుగా ఉంటుందన్నారు. వరి పంటకు ఏ దశలో ఎలాంటి సాగు పద్ధతులు అనుసరించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నది వివరించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖరరావు, ఏడీఏ నాగభూషణరావు, ఏవో సంగీత, ఏఈవో రామకోటి, వ్యవసాయ సహాయకులు అపర్ణ, లిను, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సెపక్ తక్రా క్రీడా అంశానికి సంబంధించి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరై హోరాహోరీగా తలపడ్డారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాల, బాలికల విభాగంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన బాల, బాలికల జిల్లా జట్లను హెచ్ఎం కస్తూరీ, సిబ్బంది అభినందించారు. తదుపరి రాష్ట్ర స్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ధర్మారావు, మహేష్, సూర్యారావు, ఆనందరావు పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు..!



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో శాంతి కమిటీ సమావేశాన్ని అధికారుల బృందం బుధవారం నిర్వహించింది. ఇటీవల గ్రామంలో ఎస్సీ, బీసీ వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొనగా శాంతి భద్రతల కోసం పోలీసులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ గణేష్ నేతృత్వంలో ఇరువర్గాలకు అవగాహన కల్పించారు. పరస్పర విభేదాలు పక్కన పెట్టి అంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. చిన్న విషయాలను గొడవలుగా మార్చుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఎదురైతే చట్టాలను చేతుల్లోకి తీసుకోకుండా, చట్టబద్ధమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఇరువర్గాలకు చెందిన వారితో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, ఏ సమస్యలు ఎదురైనా కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక సమస్యలకు సకాలంలో చికిత్స అందించాలి

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి

విజయనగరం ఫోర్ట్: మానసిక సమస్యలను సకాలంలో గుర్తించి చికిత్స అందించగలిగితే అనేక మంది ప్రాణాలు కాపాడవచ్చునని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పుడు నమ్మకాలు, అపోహలు విడనాడాలన్నారు. అందరితోనూ స్పష్టంగా సహానుభూతితో మాట్లాడాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే వారికి వెన్నంటి ప్రోత్సహించాలన్నారు. ఆత్మహత్య ఆలోచనలు, భావోద్వేగ సమస్యలు ఆరంభ దశలో గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గా గాయిత్రి, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ ఉద్యోగి చేతివాటంపై ఫిర్యాదు

విజయనగరం క్రైమ్ : విజయనగరంలోని రింగ్ రోడ్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్లో పని చేసిన ఉద్యోగి చేతివాటం చూపించాడు. ఇటీవల స్కూల్లో కొత్తగా జాయిన్ అయిన క్లర్క్ పద్దులు బ్యాంక్ అకౌంట్లు పరిశీలించగా దాదాపు రూ. రెండు లక్షలు తేడా ఉన్నట్టు గుర్తించిన పోలీసులను ఆశ్రయించింది. అందిన ఫిర్యాదు మేరకు పరిశీలిస్తున్నామని కేసు కడతామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

ఘనంగా సిమ్స్ బాప్టిస్ట్ చర్చి వేడుకలు

విజయనగరం టౌన్: సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో చర్చి ఆవరణలో జయ జయ ధ్వానాలతో వేడుకల ర్యాలీ నిర్వహించారు. రాజమండ్రి బిషప్ ఆర్థర్ ప్రసాద్ ప్రార్థన చేస్తూ 150 వసంత వేడుకల జ్ఞాపిక ఫలకాలను ఆవిష్కరించారు. ఆలయంలో క్రైస్తవ మహాసభలను ప్రార్థనలతో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు చర్చితో తమకున్న అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలతో ఆమెను ఆశీర్వదించారు. ముఖ్య ప్రసంగీకులుగా రాజమండ్రి నుంచి హాజరైన జాన్ వెస్లీ మహాసభలను ఉద్దేశించి ఉజ్జీవకరమైన వాక్య సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సిమ్స్ దైవజనులు వై.ప్రభాకర్, సిమ్స్ జూబ్లీ కమిటీ చైర్మన్ ఎం.ఎ.నాయుడు, కార్యదర్శి టి.ఆనందరావు, కోశాధికారి జి.సుగుణాకరరావు, కన్వీనర్ ఆర్ఎస్ఎ.కుమార్, కో కన్వీనర్ కె.రాజకుమార్, అడ్వయిజర్ ఎఫ్రాయిం పట్నా, కోఅడ్వయిజర్ కె.సుకుమార్, వర్షిప్ లీడర్ ఆర్.ఆశాజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పక్షాలు సహకరించాలి

నెల్లిమర్ల: పక్కా ఓటర్ల జాబితా తయారీలో అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారి పలు విషయాలపై చర్చించారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు కె.శ్రీకాంత్, ఎన్‌వీ రమణ, రాజారావు, రమణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వివిఆర్.జగన్నాథరావు, రాజకీయ పక్షాల నాయకులు రేగాన శ్రీనివాసరావు, కనకల పద్మనాభం, మొయిద పాపారావు, డి.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలి

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యనిర్వహక అధికారి ఆర్.మల్లిఖార్జునరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. జీవో నంబర్ 689 ప్రకారం 22 మంది ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర పండగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అందులో గురజాడ అప్పారావు పేరు లేకపోవడం దేశ వ్యాప్తంగా గురజాడ అభిమానులను, సాహితీవేత్తలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహాకవి ఇంటిని, గురజాడ సాహిత్యాన్ని, ఆయన జయంతి, వర్ధంతులను పట్టించుకోకుండా ఉండాలని నిర్ణయించుకున్నట్టు కనిపిస్తోందని, అదే జరిగితే ప్రభుత్వం పెద్ద తప్పు చేసినట్లేనని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సాంస్కృతిక శాఖ మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని సాహిత్య అభిమానులు కోరుతున్నారన్నారు. గురజాడ ఇంటిని రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరించి, గురజాడ సాహిత్యాన్ని డిజిటలైజ్ చేయాలని కోరారు.

ఆవిష్కరణలకు ఏఐ విద్య కీలకం

విజయనగరం అర్బన్: ఆవిష్కరణలు, కెరీర్ల రూపురేఖలకు కృత్రిమ మేధస్సు (ఏఐ) విద్య కీలకంగా నిలుస్తుందని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ వ్యవస్థాపక విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రవి సరేపల్లి అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇన్‌స్పైర్ టు ఇన్నోవేటివ్' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచాన్ని మార్చేది ఆవిష్కరణలేనని అది కొత్త ఆలోచనలు, కొత్త సాంకేతికతల ద్వారానే సాధ్యమని అన్నారు. ఏఐ 30 సెకన్లలో 90 శాతం కోడ్ రాసే సామర్థ్యాన్ని సాధించిందని దీంతో కాంపిటేటివ్ కోడర్లు భర్తీ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వైద్య రంగంలో ఏఐ రోగుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులు తెస్తోందని చెప్పారు. ఏఐ ట్యూటర్లు పెరుగుతున్నా, మానవ స్పర్శ మాత్రం విలువైనదేనని ఆయన స్పష్టం చేశారు. ఆవిష్కరణ ఫలితంగా మైండ్ కంట్రోల్డ్ ప్రొస్తెటిక్ అవయవాల అభివృద్ధిని ఉదాహరణగా చూపారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

విజయనగరం: సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా కుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ హోటల్లో బుధవారం రోటరీ సెంట్రల్ క్లబ్ వారు బాలలకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా సాధించాలనే తపన బాల్యం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. రోటరీ ప్రతినిధులు ప్రతీ ఏడాది సెప్టెంబర్ నెలలో విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చదువుతో పాటు, కళా రంగాలలో నిష్ణాతులు కావాలంటూ చేస్తున్న కృషిని అభినందించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 156 విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, కార్యక్రమం చైర్మన్ దినేష్, ప్రతినిధులు శశి కుక్రేజ, యూత్, సర్వీస్ డైరెక్టర్ రోహిత్ సంజయ్, కృష్ణతేజ, చెన్నాప్రదీప్, ఆర్.శంకర్‌రెడ్డి, అశోక్, జయకృష్ణ, టి.ఎల్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.